# మనలో ఒకరు

— విన్నకోట సుశీలాదేవి



అప్పలస్వామి చేసేది పోలీసు ఉద్యోగమైనా అతన్ని చూసి అతనింట్లో పిల్లి కూడా భయపడదు.

అలా భయపడకపోవడానికి ముఖ్యంగా అతని ఆకారమే కారణం!

అప్పలస్వామి, కర్రకు కాకీ ప్యాంటు, షర్టు తొడిగినట్లుంటాడు! శరీరం తెల్లగా పాలిపోయినట్లు వుంటుంది.

కాని కళ్ళు మాత్రం ఎర్రగా రక్తపు ముద్దల్లా వుంటాయి.

ఆ కళ్ళల్లోని ఎరుపు పగలే కనబడుతుంది కాబట్టి అతనికి పగలే కేసులుంటాయి! రాత్రిళ్ళు ఏ కేసూ రాదు!

కానీ ఈ రోజు అదేం ఖర్మో కానీ పగలు కూడా ఏ కేసూ తగల్లేదు. కేసుల రిజిష్టర్లో అతని పేజీ తెల్లగానే వుండిపోయింది.

ఇది కనుక హెడ్డు చూశాడంటే కల్లు తాగిన కోతిలా గెంతులేస్తాడు అనుకున్నాడు.

కల్లు అంటే జ్ఞాపకం వచ్చింది.

హెడ్డుకి సారా చుక్కంటే చాలా ఇష్టం! తను ఒక సీసా పట్టికెడితే చాలు ఆనందపడిపోతాడు.

'దాంతోపాటు ఒక చక్కని చుక్కని కూడా తీసి కెళ్ళాడంటే నా సామిరంగా, గురుడు చిత్తయిపోతాడు.' అని కూడా అనుకున్నాడు అప్పలస్వామి.

సారా అయితే నాటుదయినా ఫర్వాలేదు గానీ–

చక్కని చుక్క దగ్గరే వస్తుంది చిక్కంతా.

ఆ చుక్క తాజాగా వుండాలి.

ఈ రాత్రికి రాత్రి తాజా చుక్కలు ఎక్కడ దొరుకుతాయి?

అప్పలస్వామి మనసంతా చికాకై పోయింది.

కూర్చున్న చోటు నుంచి విసుగ్గా లేచాడు.

రెండు సందులు తిరిగి 'మస్తాను 'టీ' కొట్టు దగ్గరి కొచ్చాడు.

టీ కొట్లో గుడ్డి లాంతరు వెలుగుతోంది.

లోపల వున్న బెంచీలన్నీ మనుషులతో నిండిపోయాయి.

మస్తాను 'టీ' కలిపి అందరికీ అందించే హడావుడిలో వున్నాడు.

అతడు కానీ, ఆ బెంచీల మీద కూర్చున్న వ్యక్తులు కాని అప్పలస్వామిని లోపలికి రమ్మని

ఆహ్వానించలేదు. కనీసం అతనివేపు కన్నెత్తి కూడా చూడలేదు.

దాన్తో, అప్పలస్వామికి మండెత్తి పోయింది. కాని తనకోపం ఎవరి మీద చూపాలో తెలీలేదు.

ఇంతలో తోకాడిస్తూ ఒక కుక్క అతని ప్రక్కకు వచ్చి చేరింది.

దాన్ని లాఠీతో కొట్టాడు. అది "కుయ్యో" మని అరుస్తూ అవతలికి పోయింది. అప్పటికి అతని కోపం పోయినట్లయింది.

కొట్టు దగ్గరగా వచ్చి—

"మస్తాన్! ఒక 'టీ' ఇవ్వు!" అన్నాడు దర్జాగా.

మస్తాను తలెత్తి అప్పలస్వామి వేపు చూసి ముఖం మాడ్చుకున్నాడు.

"వచ్చాడు శనిగాడు."

అని విసుక్కుంటూ 'టీ' ఇచ్చాడు.

అప్పలస్వామి దాన్ని అందుకుని నిలబడే తాగి అక్కడి నుంచి కదిలి చుక్కల వేటలో పడ్డాడు.

*

రాత్రి పది దాటింది.

మొదటి ఆట వదిలారు.

పారిజాతం, ఆమె స్నేహితురాలు మాలతి కలిసి మొదటి ఆట సినిమా కెళ్ళి తిరిగొస్తున్నారు.

పారిజాతం రిక్షా ఎక్కుదామంది.

కాని మాలతి ఒప్పుకోలేదు.

"చల్లాగా వుంది కదే! నడిచి పోదాంలే" అంది.

పారిజాతం సరేనంది!

తను అడిగినప్పుడల్లా మాలతి సినిమాకొస్తుంది అందుకే మాలతి మాటకెదురు చెప్పి, ఆ పిల్లకు కోపం తెప్పించడం పారిజాతానికి ఇష్టం వుండదు.

ఇద్దరూ నడవసాగారు.

పారిజాతం, మాలతి ఇద్దరూ చిన్నప్పట్నించీ స్నేహితులు.

వాళ్ళ ఇళ్ళు కూడా ప్రక్కప్రక్కనే వున్నాయి! ఇద్దరూ ఎస్సెల్సీ చదివి మానేశారు!

పారిజాతానికి పెళ్ళి సంబంధం కుదిరింది; వచ్చే వారమే పెళ్ళి.

పెళ్ళయ్యేవరకూ ఇక మళ్ళీ సినిమా కెళ్ళడం కుదరదని తల్లిని బతిమాలి బయలుదేరింది పారిజాతం.

మాలతికి పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కట్నం నచ్చితే మాలతి పెళ్ళి కూడా ఈ నెలలోనే అయిపోతుంది.

ఇద్దరూ నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. లోకంలో తామిద్దరమే వున్నంత వుషారుగా వున్నారు.

ఇంతలో—

వెనక నుంచి సన్నగా ఈల.

ఆ తర్వాత వెకిలినవ్వులు విన్పించాయి.

అవి వినగానే పారిజాతం, మాలతిల మాటలు ఆగిపోయాయి.

ఒకళ్ళ మొఖాలు ఒకళ్ళు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళల్లో సంతోషం బదులు భయం చోటు చేసుకుంది.

ఇద్దరూ దగ్గరగా జరిగి చేతులు పట్టుకుని నడుస్తున్నారు.

అది చూసి వెనకవాళ్ళు – "చలివేస్తోందా! చినదానా!" అని ఒకడంటె—'వెచ్చదనం నేనిస్తా' అంటూ మరోకడూ పాటలు ప్రారంభించారు.

పారిజాతం చుట్టూ చూసింది. రోడ్డు మీద మనుషులున్నారు కానీ ఎవ్వరూ వీళ్ళను పట్టించుకునే స్థితిలో లేరు. ఎవరిగొడవ వాళ్ళదిగా వున్నారు.

మాలతి వెనుదిరిగి చూసింది.

కుర్రాళ్ళు నలుగురు వున్నారు.

వాళ్ళను చూసేసరికి మాలతికి వణుకు పుట్టింది.

ఎప్పుడూ ధైర్యంగా వుండే మాలతి కూడా భయపడుతూండడం చూసి పారిజాతం మరీ వణికి పోయింది.

రిక్షా ఎక్కకుండా నడిచి వస్తున్నందుకు ఇద్దరూ మనసులో తిట్టుకున్నారు.

ఇంతలో మాలతి దృష్టి రోడ్డు వారగా నడిచి వస్తున్న అప్పలస్వామి మీద పడింది.

గుండెల మీద వున్న బరువు ఒక్కసారిగా దింపినట్లయింది! హాయిగా వూపిరి పీల్చింది.

"పారిజాతం! ఇక భయం లేదే!" అంటూ మాలతి అప్పలస్వామి దగ్గరగా నడిచి—

"ఏవండీ! ఆ కుర్రాళ్ళు మా వెంటబడి అల్లరి చేస్తున్నారండీ!" అంది!

అప్పలస్వామి తలెత్తి ఆ పిల్లలవేపు, ఆ వెనక వున్న కుర్రాళ్ళ వేపు చూశాడు.

ఆ ఆడపిల్లలు అప్పుడే చెట్టు నుంచి కోసిన తాజాపువ్వుల్లా వున్నారు. వాళ్ళ వేపు భయం లేదన్నట్లుగా చూశాడు.

కాని ఆ కుర్రాళ్ళని చూస్తోంటేనే అప్పలస్వామికి దడ వస్తోంది. లోగడ అటువంటి కుర్రాళ్ళ చేతిలో తను తిన్న దెబ్బలు గుర్తుకొస్తున్నాయి! ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తూ నిలబడ్డాడు.

ఇంతలో ఆ కుర్రాళ్ళు సందులోకి వెళ్ళి పోయారు. వాళ్ళు అప్పలస్వామిని చూసే వెళ్ళారో, లేక వెళ్ళాల్సి వెళ్ళారో ఆ కుర్రాళ్ళకే తెలియాలి.

అప్పలస్వామి మాత్రం అదంతా తన ప్రతిభే అన్నట్లు గర్వంగా మీసం మెలేస్తూ ఆడపిల్లల వేపు చూశాడు.

మాలతి, పారిజాతం చాలా ఆనందపడ్డారు. అతని వేపు కృతజ్ఞతగా చూశారు.

అప్పలస్వామి వాళ్ళ వేపు చూశాడు.

వాళ్ళ కళ్ళల్లో అప్పలస్వామికి హెడ్డు కన్పించాడు. ఆ హెడ్డుకి తాజాపూల మీద వున్న ఇష్టం కన్పించింది. ఆ తర్వాత తెల్లగా వున్న తన పేజీ కన్పించింది.

"రండమ్మా! ఇంటివరకూ దిగబెడతాను!" అన్నాడు అప్పలస్వామి!

ఆ మాట వినగానే అతని మీద విపరీతమైన గౌరవం కలిగింది వాళ్ళకి!

'అతడు నిజంగా తమ పాలిట దేముడు' అనుకుంటూ.

'పదండి' అన్నారు!

ముగ్గురూ నడక సాగించారు!

*

హెడ్డు కొండ్రావు నిజంగానే చిన్నసైజు కొండలా వుంటాడు.

అతన్ని చూసి, స్టేషన్‌లో పోలీసు దగ్గర్నించి, ఇంట్లో పెళ్ళాం వరకూ అందరూ భయపడుతారు.

అతని కళ్ళు రాత్రిపూట కూడా ఎర్రగానే వుంటాయి!

అందుకే అతను బయటకెపితే రాత్రిపూట కూడా కేసులు దొరుకుతాయి.

ఆ రోజు రాత్రి పదిగంటల సమయంలో కొండ్రావు స్టేషన్‌లో తన గదిలో కూర్చుని కేసుల రిజిష్టరు తిరగేస్తున్నాడు.

అప్పలస్వామి పేజీ ఖాళీగా కన్పించింది. కోపంతో మండిపోయాడు.

'నా కొడుకు! రానీ వాడి పని చెప్తా!' అనుకున్నాడు పళ్ళు కొరుకుతూ.

ఎవరైనా బూతులు తిట్టడమంటె కొండ్రావుకి చాలా సరదా.

కొత్త కేసు వచ్చిన రోజు అతడికి పండగే! నోటి నిండుగా బూతులు తిట్టి హాయిగా నిద్ర పోతాడు.

ఇవ్వాళ కూడా అప్పలస్వామిని తిట్టొచ్చుకదా అనే సంతోషంతో అతని కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు కొండల్రావు!

*

అప్పలస్వామి పారిజాతం, మాలతితో కలిసి స్టేషన్‌లోకి అడుగుపెట్టాడు.

"ఇదేమిటి ఇక్కడకు తీసుకొచ్చారు?" అనడిగింది మాలతి!

"నాకు స్టేషన్‌లో కొద్దిగా పనుంది. ఇప్పుడే వస్తా!" అన్నాడు అప్పలస్వామి!

"అయితే ఇక మేము వెళ్తామండీ!" అంది పారిజాతం.

అప్పలస్వామి నవ్వుతూ —

"అమ్మమ్మ! నేను రక్షక భటుడిని! మిమ్మల్ని ఇంటికి చేర్చేవరకూ నాదే బాధ్యత. నేను పని చూసుకుని అయిదు నిముషాల్లో వస్తాను. అంత వరకూ ఆ గదిలో కూర్చోండి!" అన్నాడు.

పారిజాతం, మాలతి అతని మంచితనాన్ని మరోసారి మెచ్చుకుంటూ అతను చూపిన గదిలో కెళ్ళి కూర్చున్నారు.

అప్పలస్వామి హెడ్డు గదిలోకి వచ్చాడు.

ఆ సమయానికి హెడ్డు సబ్ ఇనస్పెక్టర్‌తో మాట్లాడుతున్నాడు.

అప్పలస్వామి లోపలకెళ్ళి హెడ్ కొండల్రావు కెదురుగా నిలబడ్డాడు.

అది చూసి కొండల్రావు ఆశ్చర్యపోయాడు అప్పలస్వామి వేపు తీక్షణంగా చూశాడు.

అయినా అప్పలస్వామి చలించలేదు!

సెల్యూట్ చేసి అలాగే ఠీవిగా నిలబడ్డాడు. అది చూసి హెడ్డు మరింత కంగుతిన్నాడు.

తన ముందు అలా నిలబడ్డానికి అతనికంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది! అనుకున్నాడు.

కొండల్రావు వేపు చూస్తున్న అప్పలస్వామి కళ్ళు నవ్వాయి.



కె. షర్మిల

మచిలీపట్నం నిర్మలా హైస్కూలులో ఐదవ తరగతి చదువుతున్న కె. షర్మిల గత నవంబర్‌లో ఆంధ్రప్రదేశ్ బాలల అకాడెమీ వారు జిల్లా స్థాయిలో నిర్వహించిన నాట్య పోటీలలో కృష్ణా జిల్లాలో జూనియర్స్ విభాగంలో పాల్గొని కూచిపూడి నాట్యంలో ప్రథమ బహుమతిని, జానపద నృత్యంలో ద్వితీయ బహుమతిని పొందింది. తన ఐదవఏట నుంచీ నాట్యాచార్య శ్రీ ఏలేశ్వరపు నాగేశ్వరశర్మ వద్ద కూచిపూడి, జానపద నృత్యాలలో శిక్షణ పొందుతున్న షర్మిల తన సోదరీలు శిరీష, మాధవిలతో కలిసి పలు నాట్య ప్రదర్శనలు ఇచ్చింది. గత సంవత్సరం షర్మిల మచిలీపట్నం, జేసీస్, రాజమండ్రి కళాజ్యోతి వారు నిర్వహించిన నాట్య పోటీలలో కూడా బహుమతులు గెలుపొందింది.

అది చూసిన హెడ్డుకి సర్వం అర్థమైంది. సంతోషంతో పొంగిపోతూ కుర్చీలోంచి లేచి—

"ఇప్పుడే వస్తా సార్!" అని అప్పలస్వామి దగ్గరకొచ్చి—

"ఎక్కడి నుంచి కొట్టుకొచ్చావోయ్?" అనడిగాడు.

"ఈ అప్పలస్వామి తలుచుకుంటే ఏదైనా చెయ్యగలడు సార్! అదిగో! మీ కోసం ఆ గదిలో...."

"ఏవిటీ? సరాసరి ఇక్కడికే తీసుకొచ్చావా? మహ మంచి పని చేశావ్ అప్పడూ!....ఏదీ చూద్దాం పద!" అంటూ హుషారుగా హెడ్ కొండల్రావు ఆ యువతులున్న గదిలోకి అడుగు పెట్టబోయాడు. సరిగ్గా అదే సమయంలో –

"కొండల్రావ్!" అంటూ సబ్ ఇనస్పెక్టర్ పిలిచాడు.

కొండల్రావ్ యస్. ఐ. కేక విని ఏమనుకున్నాడో ఏవిటో, గదిలో కెళ్ళబోయేవాడు ఆగి, వెను దిరిగి—

"వస్తున్నా సార్!" అంటూ మరుక్షణంలో యస్. ఐ. ఎదుట నిలబడ్డాడు.

సబ్ ఇనస్పెక్టర్ కొండల్రావు వేపు అనుమానంగా చూస్తూ —

"ఏవిటీ మాట్లాడుతున్నావ్!" అనడిగాడు.

హెడ్ కొండల్రావు వెంటనే – "సార్! రెండు కొత్త పిట్టలొచ్చాయిట!" అన్నాడు.

సబ్ ఇనస్పెక్టర్ ఆత్రంగా లేచి - "ఎక్కడ?" అన్నాడు.

"ఆ గదిలో సార్!"

సబ్ ఇనస్పెక్టర్ హుషారుగా ఆ గదివేపు నడిచాడు.

*

పారిజాతం, మాలతి గదిలో కూర్చుని నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు.

పారిజాతానికి నిద్ర వస్తోంది!

'అప్పలస్వామి తొందరగా వస్తే బాగుణ్ణు ఇంటికెళ్ళొచ్చు' అనుకుంటోంది. ఏవో అడుగుల చప్పుడు వినిపిస్తే, అప్పలస్వామి వచ్చాడేమోనని తలుపు వేపు చూసింది.

తలుపు దగ్గర పొడవుగా కన్పించిన ఆకారాన్ని చూసి దడుసుకున్నట్లయింది పారిజాతం. తలుపు దగ్గర నిలబడ్డ సబ్ ఇనస్పెక్టర్ వీళ్ళని చూసి చాలా ముచ్చటపడ్డాడు. ఎప్పుడూ ఎంగిలాకులే తప్ప ఇంత మృష్టాన్నం లభించలేదు. హెడ్ కొండల్రావుని మనసులో మెచ్చుకున్నాడు.

పారిజాతం వేపు చూసి కన్ను గీటాడు. "ఏయ్! పిల్లా! మన వూరు ఇదేనా?" అంటూ ముందు కొచ్చి పారిజాతం చెయ్యి పుచ్చుకున్నాడు.

అతని చర్యకి పారిజాతం, మాలతి ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

జరుగుతున్నదేమిటో తెలుసుకునేసరికి పారిజాతం సింహం పంజాలో ఇరుక్కుపోయింది. కుందేలు పిల్లలా వణికిపోయింది.

సింహం పంజా మరింత బలంగా బిగిసింది! కుందేలుని ప్రక్క గదిలోకి ఈడ్చుకెళ్ళింది.

అక్కడ ఆ చీకటి గదిలో....

కుందేలు గిజగిజా కొట్టుకుంటోంది!

అశం, శుభం తెలీని ఆడపిల్ల – మనతోపాటు పెరిగి, పెద్దదయి, ఇప్పటివరకూ నవ్వుతూ వున్న పారిజాతం ఇక మనకు లేదు.

అయిపోయింది! అంతా అయిపోయింది.

పారిజాతం మన నుంచి వెళ్ళిపోయింది!

*

ఎంతో గొడవ జరుగుతుందేమో అనుకుంటున్న హెడ్ కొండల్రావుకి ఆ పిల్ల ఎటువంటి కేకలూ పెట్టకపోయేసరికి చాలా సంతోషించాడు!

ఈదెబ్బతో సబ్ ఇనస్పెక్టర్ లొంగిరావల్సిందే-అనుకున్నాడు.

సరిగ్గా సమయానికి రెండు పిట్టల్ని తెచ్చి నందుకు అప్పలస్వామిని అమితంగా మెచ్చుకున్నాడు.

హెడ్ కొండల్రావు రెండోపిల్ల దగ్గరికెళ్లాలని బయటికొచ్చాడు.

సరిగ్గా అప్పుడే—

కొండల్రావు రెండో కొడుకు తండ్రి దగ్గరకు పరిగెట్టుకు వచ్చాడు!

వాడిని చూసి కొండల్రావు విసుక్కున్నాడు.

"ఎందుకురా! ఇప్పుడొచ్చావ్!"

"నాన్నా! అక్క సినిమాకెళ్ళి ఇంకా రాలేదు అమ్మ నీతో చెప్పమంది!" అన్నాడు.

"రాలేదా!"

"లేదు నాన్నా!"

"వారం రోజుల్లో పెళ్ళి పెట్టుకుని సినిమాకెళ్ళిందా! ఎవర్నడిగి వెళ్ళింది? ఏ ఫ్రెండింటికి పోయిందో, ఇప్పుడెక్కడుందని వెతకను?"

కొండల్రావు మండి పడ్డాడు.

అందర్నీ తిడుతూ గదిలోనుంచి బయటికొచ్చాడు.

కొండల్రావు గొంతు విని మాలతి కూడా బయటికొచ్చి—

"మావయ్యా!" అంటూ బావురుమంది.

ఏడుస్తున్న మాలతిని చూసి కొండల్రావు కంగారు పడ్డాడు.

"మాలతీ" అని పిలిచాడు.

"మావయ్యా! నువ్విక్కడే వున్నావా?"

"అవునమ్మా! నేనీ మధ్యనే ఇక్కడకు వచ్చాను. అసలు నువ్విక్కడెందుకున్నావ్ మాలతీ?" అని ప్రశ్నించాడు.

మాలతికి కాళ్లు వణుకుతున్నాయి. నోట మాట రావడం లేదు. కన్నీటితో ముఖం తడిసి పోతోంది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలీటం లేదు!

మాలతి కన్నీటిని తుడుస్తూ—

"ఏమయిందమ్మా? ఎందుకేడుస్తున్నావు!" అని అడిగాడు అనునయంగా.

మాలతి ఎలాగో గొంతు పెగుల్చుకుని—

"మావయ్యా! మన పారిజాతాన్ని ఆ పోలీసు గాడెవడో........" పూర్తి చేయలేకపోయింది.

అది విని కొండల్రావు అదిరిపోయాడు.

అతని గుండెల్లో కోటి తుపాకులు పేల్చి నట్లయింది.

ఆ పిల్ల...

ఆ కుందేలు....తన ముద్దుల కూతురు పారిజాతం కాదు గదా!

లోపలికి వేగంగా పరిగెట్టాడు.

కుందేలుని తిని సింహం తృప్తిగా త్రేనుస్తూ అప్పుడే బయటికొస్తోంది.

కొండల్రావు పిచ్చివాడయిపోయాడు.

గోడప్రక్క నున్న తుపాకీ తీసి సబ్‌ఇనస్పెక్టర్ మీద తుపాకీలో గుండ్లు అయ్యేదాకా పేలుస్తూనే వున్నాడు! సబ్‌ఇనస్పెక్టర్ నేల మీదికి ఒరిగాడు.

ఆ తర్వాత హెడ్ కొండలరావు తుపాకీ కింద పారేసి ఆదుర్దాగా గదిలో కొచ్చాడు.

అక్కడ పారిజాతం రేకులు చిదిమిన పారిజాత పుష్పంలా పడి వుంది.

ఆ దృశ్యం చూసి కొండలరావు తట్టుకోలేక పోయాడు.

తను అల్లారు ముద్దుగా పెంచిన పారిజాతం.... నాలుగు రోజుల్లో పెళ్ళి కూతురు కావలసిన తన కూతురు....ప్రాణం లేని బొమ్మలా మాంసపు ముద్దలా నేల మీద పడి వుంది.

హెడ్ కొండలరావు కూతురు మీద పడి గుండెలు బద్దలయ్యేలా ఏడ్వసాగాడు.

ఇంతలో....

తుపాకీ మోత విని ఆ స్టేషన్‌లో వున్న పోలీసులందరూ ఆ గది దగ్గరకు వచ్చారు.

చచ్చిపడి వున్న ఇబ్‌ఇనస్పెక్టర్‌ని చూసి ఏడుస్తున్న హెడ్ కొండలరావు చేతికి బేడీలు వేశారు. □

వి. మీరా

భారతీయ విద్యాభవన్‌వారు నిర్వహించే డిప్లొమా ఇన్‌జర్నలిజం కోర్సులో ప్రథమశ్రేణిలో ప్రథమురాలిగా వచ్చి, 1979-80 సంవత్సరానికి ఆ కోర్సులో ఉత్తమ విద్యార్థినిగా శ్రీ ఖాసా సుబ్బారావు బంగారు పతకాన్ని సాధించిన వనిత-కుమారి వి. మీరా. ఆమె అంతర్ కళాశాల విద్యార్థుల పోటీలలో పాల్గొని, వ్యాస రచనలోనూ వక్తృత్వంలోనూ, పత్రికా పఠనంలోనూ, పలు బహుమతులు గెల్చుకున్నారు. తీరికవేళల్లో రేఖా చిత్రాలు గీయడం, తైలవర్ణ చిత్రాలు వేయడం అలవాట్లుగాగల కుమారి మీరాకి కూచిపూడి నాట్యంలో కూడా ప్రవేశం వున్నది. ఢిల్లీ కాళింది కళాశాలలోనూ, జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోనూ ఆమె అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

గత సంవత్సరం నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా ఎం. ఏ చరిత్ర ప్రధాన పాఠ్యాంశంగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలైన మీరా ప్రస్తుతం



ఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఉత్తర రాష్ట్రాలలో ఖిలాఫత్ ఉద్యమం-హిందూ ముస్లిం ఐక్యతమీద దాని ప్రభావం అనే అంశంపై ఎం. ఫిల్‌కై కృషి చేస్తున్నారు.

—విజయవాడ విలేకరి